సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



సోమశిలలో 35.364 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 35.364 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 5111 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,725
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,897
సవర (8 గ్రాములు)	రూ.47,176

గరిష్టం/కనిష్టం
30.4 /24.3

వాతావరణం

శనివారం గాలిలో తేమ 85 శాతం ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రత సాధారణంగా ఉంది. ఆకాశం ఆదివారం మేఘావృతమై ఉండవచ్చని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌లో 3,014 కేసుల పరిష్కారం



న్యాయ సేవా సదన్ భవనం వద్ద కిక్కిరిసిన కక్షిదారులు

నెల్లూరు(లీగల్): ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,014 కేసులు పరిష్కరించి లబ్ధిదారులకు రూ.1,24,18,235 అందజేశారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు నగరానికి సంబంధించి 8 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసి 1501 కేసులను పరిష్కరించారు. అలాగే గూడూరు 344, కోవూరు 269, కావలి 158, వెంకటగిరి 95, కోట 42, నాయుడుపేట 87, సూళ్లూరుపేట 78, ఆత్మకూరు 331, ఉదయగిరి 109 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల ఇన్సూరెన్సు, బ్యాంక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న జలపాతం



మర్రిపాడు: సింగనపల్లి అటవీ ప్రాంతంలోని కోతులగుండం జలపాతం ప్రకృతి ప్రేమికులను, పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండలపై నుండి నీళ్లు కిందకు వస్తుండడంతో జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. అయితే సింగనపల్లి అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పర్యాటకులు ప్రయాసలకు గురవుతున్నారు.

పురుషుల నెట్‌బాల్ టోర్నీకి నేడు ఆత్మకూరులో ఎంపికలు

ఆత్మకూరు: త్వరలో హరియాణాలో జరగనున్న 41వ సీనియర్ జాతీయ పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపికల ప్రక్రియ ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి పీఈటీ తిరుపతయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్నట్లు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల క్రీడాకారుల కోసం ఆత్మకూరులోనే ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని తెలిపారు. మిగిలిన వివరాల కోసం 80086 85873 నంబరులో సంప్రదించాలని పీఈటీ తిరుపతయ్య వివరించారు.

లారీని ఢీకొన్న టెంపో ఐదుగురికి తీవ్రగాయాలు

కోవూరు: కోవూరు సమీపంలో జాతీయ రహదారిపై సాయిబాబా గుడి వద్ద శనివారం తెల్లవారుజామున కాకినాడ నుంచి శబరిమలైకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల టెంపో లారీని ఢీకొంది. ఈ సంఘటనలో టెంపోలో ప్రయాణిస్తున్న ఐదుగురు అయ్యప్ప భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి కోవూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్య సేవల కోసం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన రామకృష్ణ, పాసలపూడికి చెందిన అప్పలస్వామి, చింతలు, శ్రీనివాసరావు, వెంకట్రావులు ఉన్నారు.

అశ్వమా.. ఏదీ ఆ యశస్సు!

దేశంలో గుర్రాల సంఖ్య

2019లో - 3.4 లక్షలు
2022 నాటికి - 76 వేలు
మన రాష్ట్రంలో - వందల్లో (అంచనా)
జిల్లాలో - పదుల్లో (అంచనా)



రామాయణ కాలం నుంచి రాజుల పాలన వరకు మన దేశంలో అశ్వానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. గుర్రాలపైనే అప్పటి రాజులు రాజ్యంలో పర్యటనలు చేసేవారు. విజయనగర రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు కూడా జిల్లాలోని ఉదయగిరి కోటను జయించేందుకు తన సైన్యంతో గుర్రంపైనే వచ్చారు. అశ్వకదళం ఎంత పెద్దదిగా ఉంటే అప్పటి రాజులు అంత బలమైన వారుగా గుర్తింపబడే వారంటే అతిశయోక్తి కాదు. అంతటి ఘనమైన చరిత్ర ఉన్న అశ్వాలు నేడు జిల్లాలో పదుల సంఖ్యలోకి చేరాయి.

సండే స్పెషల్

సాక్షి, నెల్లూరు డెస్క్: చరిత్రలో ఎంతోమంది బలమైన రాజులు... ఇతర రాజ్యాలను తమ ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు 'అశ్వ'మేధ యాగం నిర్వహించేవారు. రామాయణ కాలం నుంచి రాజుల కాలం వరకు కొనసాగిన ఈ అశ్వమేధ యాగంలో బలమైన గుర్రానికి (అశ్వం) తమ రాజ్యం గుర్తుగల జెండాను ఏర్పాటు చేసి వెనుకనే సైన్యం వెళ్లేది. ఆ అశ్వం ఎంతదూరం వెళితే ఆ ప్రాంతమంతా వారి అధీనంలో ఉండేది. ఇలా రాజుల కాలంలో గుర్రానికి ప్రాధాన్యత ఎంతో ఉండేది. అంతటి ఘనమైన చరిత్ర ఉన్న అశ్వాలు నేడు జిల్లాలో పదుల సంఖ్యలోకి చేరడం జంతు ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తోంది.

- బ్రిటిష్ పాలనలో సైతం మన దేశంలో దొరలు గుర్రాలపైనే ప్రయాణం చేసేవారు. నాటి సర్ ఆర్థర్ కాటన్ దొర గోదావరి నది పరీవాహక ప్రాంతంలో గుర్రంపై వందలాది కిలోమీటర్లు పర్యటించి ఆ ప్రాంత రైతులు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందిని గమనించి ధవళేశ్వరం ప్రాజెక్ట్ (సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్)ను నిర్మించారంటే కేవలం గుర్రం మీద ప్రయాణం చేయబట్టే అంటే అతిశయోక్తికాదు. రాజుల కాలంలో గుర్రాలతోనే కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేయించేవారు. ఉదాహరణకు రెడ్డిరాజులు పాలించిన కొండవీడు, అద్దంకి, గద్వాల ప్రాంతాల్లో గుర్రాలతో వ్యవసాయం చేయించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.
- విశ్వాసానికి మారు పేరుగా గుర్రాన్ని పేర్కొన్న ఘటనలు కూడా చరిత్రలో ఉన్నాయి. నెల్లూరు జిల్లా కోవూరు తాలుకా పాటూరు ప్రాంతానికి చెందిన ఖడ్గ తిక్కన యుద్ధంలో మృతి చెందితే అతని తలలేని మొండేన్ని ఇంటికి చేర్చింది ఆయన పెంచుకున్న గుర్రమేనని చరిత్రలో పేర్కొన్న విషయం మరువలేం. ఉత్తర భారతదేశానికి చెందిన మహావీరుడు రాణా ప్రతాప్ సైతం మొగలాయిలతో యుద్ధంలో పోరాడి వీరమరణం పొందితే అతని మృతదేహాన్ని శత్రువులకు అందకుండా స్వగ్రామానికి చేర్చినది అతను పెంచుకున్న గుర్రమే. ఇలా చరిత్రలో గుర్రానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.
- కాలక్రమంలో ఆధునిక కాలంలో యంత్రంతో పనిచేసే వస్తువులు, వాహనాలు రావడంతో గుర్రాల ప్రాముఖ్యత తగ్గిపోయింది. జిల్లాలో 70 ఏళ్ల క్రితం వరకు వేలల్లో గుర్రాలు ఉండేవని ఆ తరం వృద్ధులు చెబుతున్నారు. అప్పుడు ప్రయాణాలకు గుర్రపు బళ్లు మాత్రమే ఉండేవట. సేద్యం పనుల్లోనూ కొన్ని చోట్ల గుర్రాలనే వినియోగించేవారట.

గంటకు 40 మైళ్ల వేగం

గుర్రాల సగటు జీవితకాలం 25 నుంచి 30 సంవత్సరాలు. ఇవి గంటకు 40 మైళ్ల వరకు పరిగెత్తుతాయి. పొడవైన మెడ, పెద్ద ఛాతీ, శక్తివంతమైన వెనుకభాగం, బలమైన కాళ్లు కలిగి ఉండటం వీటి ప్రత్యేకత. సహజంగా 400 నుంచి వెయ్యి కిలోల బరువు ఉంటాయి. పుట్టుకతోనే బలమైన నాడీ వ్యవస్థను కలిగి ఉండి పుట్టిన కొద్దిసేపటికే అవి తమ కాళ్లపై నిలబడగలుగుతాయి. ఇవి పిరికి జంతువుల కిందకే వస్తాయి. సహజంగా ప్రమాదం నుండి పారిపోయే ధోరణిని కలిగి ఉంటాయి. శత్రువు దాడి చేస్తున్నాడని భావిస్తేనే చాలా అరుదుగా మాత్రమే దాడి చేస్తాయి.



ఖాన్‌సాబ్ అలీ ఔలియా దర్గా గంధోత్సవాన్ని గుర్రంపై తీసుకెళ్తున్న పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేశి హజరత్తయ్య) (ఫైల్)

- ప్రస్తుతం పెద్ద నగరాలలో గుర్రపు స్వారీ పోటీలలో వాటికి ప్రాధాన్యం ఇస్తూ వినోదానికి మాత్రమే గుర్రాలను ఉపయోగిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కేవలం పెళ్లిళ్లలో వధూవరుల ఊరేగింపులకు మాత్రమే గుర్రాలను ఉపయోగిస్తున్నారు. కొన్ని కుటుంబాలు గుర్రాలను పెంచుతూ వివాహాది కార్యక్రమాలకు అద్దెలకు పంపుతున్నారు.

చిన్నారుల్లో రుగ్మతల నివారణకు...

చిన్నారుల్లో వివిధ మానసిక రుగ్మతలు నయం చేసేందుకు వివిధ వైద్య విధానాలకు లొంగని వాటికి అరుదైన చికిత్స విధానం గుర్రపు స్వారీ థెరపీ అని ఇటీవల వైద్యులు పలు ప్రయోగాల ద్వారా తెలుసుకున్నారు. పోలియో, పక్షవాతం, మెదడు, వెన్నెముక సమస్యలు, స్థిమితం కోల్పోవడం వంటి వాటికి గుర్రపు స్వారీ థెరపీలో నయం చేయవచ్చని గుర్తించారు. గుర్రపు స్వారీ చేయడం ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుందని అంటున్నారు. కళ్లాలు పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, అశ్వాన్ని దూకించడం, ఒక లయలో ముందుకు సాగడం... ఇవన్నీ మెదడు, శరీరానికి మధ్య చురుకైన సమన్వయం ఏర్పడటానికి దోహదం చేస్తుందని వైద్య పరిశోధనలో తేలింది.

గుర్రాన్ని పోషించుకోవడమే ఆనందం

మా మామ సుమారు 50 ఏళ్ల పాటు గుర్రాన్ని పెంచుకుంటూ పెళ్లిళ్లు, గంధమహోత్సవాలు, ఇతర వేడుకల సమయంలో కార్యక్రమాలకు గుర్రాలను తీసుకెళ్లి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవారు. ఆయన మరణం తరువాత గుర్రాన్ని నేను పోషించుకుంటున్నాను. రోజుకు కనీసం రూ.400 విలువైన ఉలవలు, పచ్చిగడ్డి దాణాగా పెడతాం. వారానికి ఒకసారి వేడినీళ్లతో స్నానం చేయిస్తాం. కుటుంబంలో జరిగే కార్యక్రమాలకు రూ.3 వేలు చొప్పున, కళ్యాణ మండపంలో జరిగే కార్యక్రమాలకు రూ.6 వేలు చొప్పున తీసుకుంటాం. ఇది కాకుండా నెల్లూరులో జరిగే రొట్టెల పండగ కోసం ఒక రోజు, కసుమూరు దర్గాలో మూడు రోజులు, మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేటలోని అలీ ఔలియా దర్గాలో 12 రోజులు మా గుర్రం గంధ మహోత్సవాల్లో పాల్గొంటుంది. గుర్రంపై వచ్చే ఆదాయం కన్నా దాన్ని పోషించుకోవడంలోనే మా కుటుంబానికి ఆనందంగా ఉంటుంది.



– షేక్ మహబూబ్ బాషా (ఆలీ), ఈదామిట్ట, నెల్లూరు

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం



అనంతపురం గ్రామంలో తుఫాన్‌కు దెబ్బతిన్న రొయ్యల చెరువులను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి



దెబ్బతిన్న రొయ్యల గుంటలకు సంబంధించి అధికారుల నుంచి వివరాలను తీసుకుని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- తుఫాన్‌కు దెబ్బతిన్న రొయ్యల గుంటలను పరిశీలించిన మంత్రి

తోటపల్లిగూడూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఉదారంగా ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరకవిపూడి పంచాయతీ అనంతపురం గ్రామంలో తుఫాన్ దాటికి దెబ్బతిన్న రొయ్యల గుంటలను మంత్రి కాకాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందని నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులతో పాటు రొయ్యల సాగు రైతులందరికీ నష్ట పరిహారం అందజేస్తామన్నారు. సాధారణంగా విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్ విధానాల మేరకు నష్ట పరిహారం చెల్లిస్తుంటారని కాని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ విధానాలను సైతం సడలించి, నష్ట పరిహారం ధరలను మరింత పెంచి రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకొంటున్నారన్నారు. దెబ్బతిన్న పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో లెక్కించడానికి ఎన్యూమరేషన్ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. వ్యవసాయానికి సంబంధించి నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో మేలు రకం విత్తనాలను అందజేస్తామని, ఇందు కోసం ఒరిస్సా నుంచి ఇప్పటికే 500 టన్నులు సేకరించామని, మరో 500 టన్నుల విత్తనాలను తెప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, విత్తనాభివృద్ధి సంస్థ అథారిటీ రాష్ట్ర సభ్యులు కోటా శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసుల నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- అవినీతిపరుడ్ని వెనకేసుకు వచ్చి ఐటీడీఏ పీఓను దుర్భాషలాడారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి



విలేకరులతో మాట్లాడుతున్న పాలకీర్తి రవి

నెల్లూరు (వేదాయపాళెం): దళిత అధికారిణి అయిన ఐటీడీఏ పీఓపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, బెదిరింపులకు పాల్పడిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి డిమాండ్ చేశారు. నగరంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట శనివారం సోమిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా గిరిజన సంఘం నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పీఓపై సోమిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. గిరిజన సంఘం నేత ముసుగులో అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న కేసీ పెంచలయ్యకు మద్దతుగా సోమిరెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పెంచలయ్యకు అండగా ఐటీడీఏ పీఓ మందా రాణిని అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన సోమిరెడ్డిని అరెస్టు చేసి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సోమిరెడ్డిని అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళిత గిరిజన సంఘాలన్నీ ఏకమై నిరసన, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కేసీ పెంచలయ్య ఐటీడీఏ పరిధిలో చేసిన కాంట్రాక్ట్ వర్కులన్నిటిలోనూ అవినీతి జరిగిందని ఆరోపించారు. వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయాన్ని సోమిరెడ్డి, పెంచలయ్యలు అడ్డుకోలేరన్నారు. ఈ సమావేశంలో దళిత గిరిజన నేతలు గోపాల్, పోలయ్య, వెంకయ్య, చెంచయ్య, విజయనిర్మల, రోజా రాణి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు

పురిటి నొప్పులతో వేదన పడుతుండగా...

- రేషన్ పంపిణీ వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- మానవత్వం చాటుకున్న వాహన ఆపరేటర్



రేషన్ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



ఆస్పత్రిలో పండంటి బిడ్డతో తల్లి కృపావతి

అల్లూరు: స్థానిక చెర్లో సంఘానికి చెందిన మాణికాల కృపావతి శనివారం పురిటి నొప్పులతో బాధపడుతూ 108కు కాల్ చేసింది. వాహనం రాకముందే ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో అదే సమయంలో అటువైపుగా రేషన్ పంపిణీ వాహనం వచ్చింది. గర్భిణి వేదనను గమనించిన వాహన ఆపరేటర్ దేశిరెడ్డి సుమన్‌రెడ్డి ఆమెను వెంటనే రేషన్ వాహనంలో అల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఆస్పత్రికి తరలించిన కొద్ది సేపటికే ఆమె పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. సరైన సమయంలో ఆసుపత్రికి తరలించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్లు తెలియజేశారు. మానవత్వాన్ని చాటుకున్న రేషన్ వాహనం ఆపరేటర్ సుమన్‌ను స్థానికులు అభినందించారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 20వ తేదీన నెల్లూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 81 గ్రూప్–1, 897 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో.. గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1, గ్రూప్–2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8179100598 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ:
డిసెంబర్ 20, 2023 (బుధవారం)

వేదిక
దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్ సోమశేఖరపురం, నెల్లూరు.

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 8179100598

ఏడీఎఫ్.. ఆదర్శం

ఏడీఎఫ్ ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తోంది. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఏడీఎఫ్‌ను ఏర్పాటు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వివిధ ప్రాంతాలు, విదేశాల్లో స్థిరపడిన ఆత్మకూరు వాసులను సమీకృతం చేసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములను చేశారు. బడి నుంచి బస్టాండ్ వరకు, పల్లె నుంచి పట్టణం వరకు ప్రగతి పథంలో నడిపిస్తున్నారు.

- ఏడాది పూర్తి చేసుకున్న ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం
- ఆత్మకూరు నియోజకవర్గంలో నిరాటంకంగా అభివృద్ధి పనులు


యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు (ఫైల్)



ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పుట్టిన గడ్డపై మమకారం ఉన్న ప్రతి ఒక్కరినీ ఒక్కతాటిపైకి తెచ్చి ఏర్పాటు చేసిన వేదికే ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం. గతేడాది డిసెంబర్ 10వ తేదీన ఏర్పాటైన ఈ ఫోరం సంవత్సర కాలాన్ని పూర్తి చేసుకుని నేడు వార్షికోత్సవం జరుపుకోనుంది.

పయనం ఇలా..

ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలల్లోనే నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ, మజారా గ్రామాలు, వార్డుల్లో ముమ్మరంగా పర్యటించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రైవేట్ భాగస్వామ్యం తోడైతే నియోజకవర్గాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేసుకోవచ్చనే ఆలోచన చేశారు. వెంటనే నియోజకవర్గంలో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఉన్నత సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని, అందరితో స్వయంగా మాట్లాడి 2022 డిసెంబర్ 10వ తేదీన ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో తమ కుటుంబం అందరికీ ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో రూ.10 కోట్లతో ఏడీఎఫ్ ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఏడీఎఫ్ పార్టీలకతీతంగా ప్రభుత్వం చేసే అభివృద్ధితోపాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో నిరంతరాయంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తుందని ఆ సమావేశంలోనే స్పష్టం చేశారు. ఏడీఎఫ్ ప్రారంభమైన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో భాగంగా తన సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తలపెట్టిన ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడంతో ఏడీఎఫ్ సేవలు మరింత విస్తరించి అందులో భాగస్వాములయ్యేందుకు మరికొందరు ముందుకొచ్చారు. అంతటితో ఆగక ఏడీఎఫ్ బెంగళూరు చాప్టర్‌ను ఆవిష్కరించి అక్కడి వారిని కూడా భాగస్వాములను చేసి సేవలను మరింత విస్తృతం చేశారు.


ఏడీఎఫ్ ద్వారా ఆత్మకూరులో నిర్మించిన మున్సిపల్ బస్టాండ్

ఒక్క సంవత్సరంలోనే..

ఆత్మకూరు నియోజకవర్గంలో 100కు పైగా పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటుతోపాటు సంగంలో ఐటీఐ కళాశాల నిర్మాణానికి దాతల సహకారంతో అడుగులు పడ్డాయి. మండల కేంద్రాల్లో బస్టాండ్‌ల నిర్మాణాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సేవలందించేలా ఏడీఎఫ్ విధివిధానాలను రూపొందించి ముందుకుసాగుతోంది. ఏడీఎఫ్ గురించి తెలుసుకున్న అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి డిజిటల్ లైబ్రరీతోపాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేసేందుకు రూ.కోటి సహకారం అందించారు. పార్టీలకతీతంగా, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతున్న ఏడీఎఫ్ సేవలు మరింత విస్తృతమై ప్రజలకు మేలు జరగాలని పలువురు కోరుకుంటున్నారు.

సేవలు విస్తరిస్తే మరింత ప్రయోజనం



దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మకూరు డెవల్‌మెంట్ ఫోరం అందిస్తున్న సేవలు అభినందనీయం. ఆత్మకూరులో ఎంజీఆర్ బస్‌స్టేషన్ సముదాయాన్ని చాలా సౌకర్యవంతంగా నిర్మించారు. అక్కడ నిర్మించిన గదులు కూడా కేటాయింపులు చేసి వ్యాపారాలు ప్రారంభిస్తే ప్రజలకు మరింత అనువుగా ఉంటుంది.

– కేవీ శేషారెడ్డి ఆత్మకూరు సిటిజన్స్ ఫోరం కార్యదర్శి

పల్లె వైద్యానికి చేయూత



దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయసాధనే ధ్యేయంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రారంభించిన ఏడీఎఫ్ ద్వారా గ్రామాల్లోని 40 శాతం పీహెచ్‌సీలకు ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చడంతో నాణ్యమైన వైద్యసేవలు అందించే అవకాశం కలుగుతోంది. ఏడీఎఫ్ ద్వారా రానున్న రోజుల్లో వైద్యరంగానికి పరిపూర్ణమైన చేయూతనందించి ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తారని ఆశిస్తున్నాం.

– డాక్టర్ జె.ప్రణీత్, ఎండీ, శ్రీవెంకటేశ్వర ప్రజా వైద్యశాల, ఆత్మకూరు

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 725 విద్యుత్ కేసులు రాజీ

- రూ.13 లక్షల జరిమానా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో విద్యుత్ చౌర్యానికి సంబంధించిన 725 కేసులు రాజీ అయ్యాయని ఏపీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బీ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులోని జిల్లా కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి సంబంధించిన 725 కేసుల్లో రాజీ కుదిర్చి రూ.13,02,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తండ్రి ఫోన్ తీసుకున్నాడనే మనస్తాపంతో ఓ బాలిక (మైనర్) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలో చంద్రకళ – సురేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ ఖోఖో క్రీడాకారిణులు. చంద్రకళ టైలరింగ్ చేస్తుంది. సురేష్ ఆటో నడుపుతూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె నవ్య(17)కు ఆరు నెలల క్రితం ఖోఖో టోర్నమెంట్‌లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలానికి చెందిన ఖోఖో క్రీడాకారుడు విజయ్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమకు దారితీసింది. రెండు నెలల క్రితం బాలిక విజయ్ వద్దకు వెళ్లగా తల్లిదండ్రులు ఆమెకు మంచిమాటలు చెప్పి ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం చదువుకోవాలని చెప్పి సిమ్ లేని మొబైల్‌ను ఆమెకు ఇచ్చారు. అయినప్పటికీ బాలిక చదువుకోకుండా పక్కింటిలోని వైఫైతో చాటింగ్ చేయసాగింది. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీ రాత్రి దంపతులిద్దరూ పని నుంచి ఇంటికి వచ్చే సరికి బాలిక ఫోన్ చూసుకుంటూ ఉంది. దీంతో తండ్రి ఆమె వద్దనున్న ఫోన్ తీసుకున్నారు. అనంతరం దంపతులిద్దరూ ఇంటి గేటు ముందు కూర్చొని మాట్లాడుకోసాగారు. ఫోన్ తీసుకున్నారని మనస్తాపం చెందిన బాలిక గేటుకు తాళం వేసి చనిపోతున్నానంటూ ఇంట్లోకి వెళ్లింది. తల్లిదండ్రులు గేటు తాళం పగలగొట్టి లోనికి వెళ్లి చూసేసరికే బాలిక హాలులోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. పక్కింటి వారి సాయంతో బాలికను కిందికి దించి హుటాహుటిన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లిదండ్రులు శనివారం తెల్లవారుజామున వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ, ఎస్సై అంకమ్మ ఘటనా స్థలాన్ని, ఆస్పత్రిలో ఉన్న బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పాలనతో వైఎస్సార్‌సీపీలోకి వలసలు


మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పెద్ద ఎత్తున వలసలు వస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం దుగ్గుంట పంచాయతీ కొత్తకంబాలపల్లిలో శనివారం ఆ గ్రామానికి చెందిన 50 కుటుంబాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గంగోటి ధనంజయ, గంగోటి వేణుగోపాల్, పల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కాకాణి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు చూసి తమ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు వలస వస్తున్నట్లు తెలిపారు. దుగ్గుంట పంచాయతీలో వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉందని తెలిపారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతుండడంతో సోమిరెడ్డికి దిక్కుతోచడం లేదన్నారు. సర్వేపల్లి నుంచి 25 వేల మెజార్టీతో గెలుస్తానని సోమిరెడ్డి ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్వేపల్లిలో బలమైన నాయకుడి కోసం చంద్రబాబు వెతుకుతున్నట్టు ప్రచారం ఉందన్నారు. తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కొత్తకంభాలపల్లికి అంతర్గత రోడ్లు వేయించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, జేసీఎస్ కన్వీన్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య, నాయకులు మోహన్‌రాజు, ఎం.సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం


రైతులకు సబ్సిడీ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం, నేడు వైఎస్సార్ తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు శనివారం స్థానిక గోడౌన్ వద్ద రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతుల నారుమళ్లు, వరి నాట్లు దెబ్బతినడంతో వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అల్లూరు మండలానికి 310 క్వింటాళ్ల వరి విత్తనాలను కేటాయించినట్లు తెలిపారు. రూ.900 విలువ చేసే వరి విత్తనాల బ్యాగులను 80 శాతం సబ్సిడీతో కేవలం రూ.180లకే అందించినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ముందుకుసాగుతోందని తెలిపారు. పంటలబీమా కూడా త్వరితగతిన ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఓ లలిత, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, వైఎస్సార్‌సీపీ అల్లూరు టౌన్, రూరల్ అధ్యక్షులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు మేడా శ్రీనివాసులురెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ ఉస్మాన్ షరీఫ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను గుర్తించడమే లక్ష్యం


స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మట్టిలో మాణిక్యాలైన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మండలంలోని వివిధ గ్రామాల క్రీడాకారులకు ఐదు రకాల క్రీడలకు సంబంధించిన కిట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం గ్రామీణ క్రీడాకారులకు వరమన్నారు. విశేష ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి రూ.100 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగే వివిధ రకాల క్రీడల్లో ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ డిసెంబర్ 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఎంపీపీ ఎం. శ్రీనివాసులు, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బుచ్చి టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.